ఎంఎస్ స్వామినాథన్, నాగేంద్ర నాథ్‌లకు ముప్పాళ్ల సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు : వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు, వ్యవసాయ ఉత్పత్తుల ఇదోదిక వృత్తికి శాస్త్ర విజ్ఞానాన్ని సకాలంలో దేశ రైతాంగానికి అందించిన ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం బాధాకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్తని దేశం కోల్పోవడం బాధాకరమన్నారు. వారి మృతికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరి రైతులతో పాటు మొత్తం రైతాంగ ఉద్యమానికి తన చివరి శ్వాస విడిచే వరకు పార్టీలకతీతంగా అంకితమై కృషిచేసిన ప్రఖ్యాత రైతు నాయకులు ఎర్నేని నాగేంద్ర నాథ్ ఆకస్మిక మృతికి జోహార్లు అర్పిస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ముప్పాళ్ల తెలియజేశారు.

ప్రజల గుండెల్లోనే చంద్రబాబు

విశాలాంధ్ర-గుంటూరు : తమ అధినాయకుడు, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు జైల్లో ఉన్నప్పటికీ ప్రజల గుండెల్లో ఉన్నారని, ఆయన్ను అక్రమ కేసుల్లో ఇరికించినా సహనం వహిస్తూ దర్యాప్తునకు సహకరిస్తున్న తీరుతో ఆయన పట్ల అందరిలో ఇంకా గౌరవం, అభిమానం పెరిగాయని ఆ పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గా లలో నిర్వహించిన బాబుతో నేను నిరసన కార్యక్రమాలలో ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రబాబుపై పెట్టినవి అక్రమ కేసులు కనుకే ఆయనకు మద్దతుగా రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లో కూడా సంఘీభావం తెలుపుతున్నారన్నారు. ఎటువంటి అవినీతికి పాల్ప డని చంద్రబాబును జైల్లో పెట్టి కుతంత్రాలు చేసి వచ్చే ఎన్నికల్లో గెలు ద్దామనే ఆలోచనలో జగన్ ఉన్నాడని మండిపడ్డారు. శాడిస్టు ఆనందం పొందుతున్న జగన్ నిర్ణయాలు, అతని పాలనా తీరును ప్రజలు గమనిస్తున్నారని, అతనికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. బాబు విడుదల అయ్యేంతవరకు పోరాటం ఆగదన్నారు.

జగన్ తీరుతో పరిశ్రమలు వెనక్కి

విశాలాంధ్ర-తాడికొండ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీరుతో పరిశ్రమలు వెనక్కిపోయి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని టీడీపీ మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆరోపించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న నిరాహార దీక్ష గురువారానికి 16వ రోజుకు చేరింది. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జాడే లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించట్లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతికి అహ్మద్ బేగ్ సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు : భారత హరిత విప్లవ పితామహుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్ ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. స్వామినాథన్ మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ వ్యవసాయ కార్మికుల కోసం, రైతులకు పెట్టుబడుల కోసం ప్రభుత్వంతో ఎంతో పోరాడారన్నారు. 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు సాధించారని, ఆ తర్వాత ఆయన చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. స్వామినాథన్ అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. 1971లో ఆయన రామన్ మెగాసెసే అవార్డు సొంతం చేసుకున్నారని అన్నారు.

జీ తెలుగులో 'సీతే రాముడి కట్నం'

విశాలాంధ్ర-గుంటూరు : మరో ఆసక్తికరమైన అంశంతో సాగే సీరియల్‌ను తన అభిమాన వీక్షకులకు అందించేందుకు జీ తెలుగు సిద్ధమైంది. ఆసక్తికరమైన కథ, కథనంతో సరికొత్త సీరియల్ 'సీతే రాముడి కట్నం'లో అత్తాకోడళ్ల మధ్యనున్న ప్రత్యేకమైన బంధాన్ని కొత్తకోణంలో చూపించనున్నారు. అనుకోకుండా ముడిపడే సీతారాముల బంధం, సహజమైన అందంతో ఆత్మసంతృప్తికి ప్రాధాన్యమిచ్చే కోడలు, ఆకర్షించే బాహ్యసౌందర్యమే ప్రధానమైనదని భావించే అత్త మధ్య సాగే ఈ కథలోని మలుపులు సీరియల్‌ను మరింత ఆసక్తికరంగా మారుస్తాయి. ఈ సీరియల్లో వైష్ణవి, రామ్ సమీర్ నటిస్తున్నారు. మహాలక్ష్మిగా మంజుల పరిటాల నటించడం విశేషం. ఇక సీత తండ్రి పాత్రలో ప్రముఖ నటుడు ఇంటూరి వాసు కనిపించనున్నారు. సీతే రాముడి కట్నం సీరియల్ ప్రారంభంతో మిగతా సీరియల్స్ ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయని ప్రతినిధి తెలిపారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం.. రాకపోకలకు అంతరాయం

విశాలాంధ్ర-తాడేపల్లి: వడ్డేశ్వరంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుండి కొలనుకొండ సచివాలయం వైపు వెళ్ళు రహదారిలో విద్యుత్ స్తంభం గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నేలకొరిగింది. గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షం, గాలులకు విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ముళ్ళ చెట్ల కొమ్మలు దారికి అడ్డంగా విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాత్రి సమయంలో గ్రామస్తులు, అటువైపుగా వెళ్ళు మద్యం బాబులు నిత్యం వాహనాలతో రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ అధికారులు అప్రమత్తమై, విద్యుత్ సరఫరాని నిలిపివేసి, ఒరిగిన స్తంభాన్ని తీసివేసి, వెంటనే విద్యుత్తు లైన్లు పునరుద్ధరించాలి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తమవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో ఎస్ఎంఎఫ్జీ గృహశక్తి కార్యకలాపాల విస్తరణ

గుంటూరు: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అందుబాటు ధరల గృహ ఋణ కంపెనీల్లో ఒకటైన ఎస్ఎంఎఫ్జీ గృహ శక్తి ఏలూరులో తమ మొదటి శాఖతో రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది రాష్ట్రంలో సంస్థకు 9వ శాఖ. రాష్ట్రమంతటా ఈ విస్తరణ, రాష్ట్రమంతటా వీలైనంత ఎక్కువ మందికి సరసమైన ధరల్లో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ యొక్క దృఢమైన లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్ఎంఎఫ్జీ గృహశక్తి, తమ విస్తృతమైన అనుభవం, బలమైన పేరెంటేజ్, దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్,!బలమైన రిస్క్ మేనేజ్మెంట్ ఫ్రేమ్ వర్క్ తో గృహ, గృహాభివృద్ధి, గృహ నిర్మాణం, గృహ విస్తరణతో పాటుగా తనఖా రుణాలు, మధ్య స్థాయి డెవలపర్లకు కొత్త లేదా పునఃవిక్రయం వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు, నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు సహా విస్తృతమైన రుణాల పోర్ట్ ఫోలియోను కలిగి వుందని ఎస్ఎంఎఫ్జీ గృహశక్తి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పెదనందిపాడు : నియోజకవర్గ పరిధిలోని కుర్నూతుల వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు ప్రత్తిపాడు మండల పరిధిలోని కొయ్యవారిపాలెం గ్రామ నివాసిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-గుంటూరు : సర్దార్ భగత్ సింగ్‌కు భారత రత్న ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

జంగాల చైతన్య, షేక్ వలి డిమాండ్ చేశారు. భగత సింగ్ ఆలోచన విధానాన్ని యువత అధ్యయనం చేసి, ఆయన ఆశయ సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్థానిక భగత్ సింగ్ సెంటర్‌లో భగత్ సింగ్ 116వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశం కోసం పోరాటం చేసాడని, బ్రిటిష్ వారితో పోరాటం చేయడంతోపాటు, దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయమైన ఆలోచన విధానాన్ని తెలిపాడన్నారు. సామ్యవాదం, కమ్యూనిజం, శాస్త్రీయ సోషలిజం లక్ష్యాలతో అతి చిన్న వయస్సులో పోరాటం చేశారన్నారు. దేశంలో ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేసి ఉద్యమించాడన్నారు. ఇది నేటి యువతకు ఎంతో ఆదర్శమని చెప్పారు. ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నదని, చదువుకున్న చదువుకు సరైన ఉద్యోగాలు దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యువత మేల్కొని భగత్ సింగ్ ఆలోచన విధానంతో, పోరాట స్ఫూర్తితో ముందుకు వచ్చి ఉద్యమించాలని అన్నారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, నాయకులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో: ఆచార్య నాగా ర్జున యూనివర్సిటీలో ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంబీఏ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ చంద్రశేఖర్ చేతుల మీదుగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యా ర్థులు విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వరకూ ర్యాలీగా వెళ్లి భగత్ సింగ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

తెనాలిలో: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గంలో సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా

శివాజీ చౌక్‌లో విద్యార్థులు, ఏఐ ఎస్ఎఫ్ నాయకులతో కలిసి భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి పాలాభిషేకం చేసి నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్ తెలి పారు. ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం తన ప్రాణాలను అర్పించిన సర్దార్ భగత్ సింగ్‌ను ఆద ర్శంగా తీసుకొని నేటి యువత ఆయన ఆశయ సాధనకై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ ఎఫ్ తెనాలి టౌన్ కార్యదర్శి గండు శివ, అధ్యక్షుడు చెన్నూరు సాయి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగాన్ని కాపాడాలని విద్యార్థులందరూ పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దినేని కిరణ్ బాబు, నాయకులు తాండూరు భూమేష్, ఎస్వంత్, వినయ్, సాయి, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కుంభ రవితేజ, బిల్లా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా చిత్రపటానికి కలెక్టర్ నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నవయుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా 129వ జయంతి సందర్భంగా గురువారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుఱ్ఱం జాషువ చిత్రపటానికి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, జిల్లా రెవిన్యూ అధికారి చంద్రశేఖరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బి ఎస్.ఈ గుర్రం బ్రహ్మయ్య, డి.పి.ఓ కేశవ రెడ్డి, డియంఅండ్‌హెచ్ఓ డా.శ్రావణ బాబు, పశు సంవర్ధక శాఖ జె.డి వెంకటేశ్వర్లు, సిపిఓ శేషశ్రీ, చేనేత, జౌళి శాఖ ఏడి వనజా, జిల్లా టూరిజం అధికారి నాయుడు, కలక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలో ప్రతి ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మేడికొండ జస్వంతరావు అన్నారు. స్థానిక సచివాలయాల పరిధిలోని ఎన్‌యంలు, ఆషా కార్యకర్తలు గురువారం పట్టణంలో ఇంటింటికి తిరిగి హిమోగ్లోబిన్, బిపి, షుగర్ టెస్టులు నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అక్టోబర్ 5వ తేదీ నుండి నిర్వహించనున్న ప్రత్యేక వైద్యశిబిరాల వద్దకు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వారిని తీసుకువెళ్ళి వారికి ప్రముఖ వైద్యులతో ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేయనునన్నట్లు తెలియజేశారు. ముత్తింశెట్టిపాలెం, బాలాజీరావు పేట, చెంచుపేట, చినరావూరు, రావి రవీంద్రనాద్ నగర్ సచివాలయాల యందు ఏఎన్‌యంలు, ఆషా కార్యకర్తలు, వాలంటీర్లు కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

విజయవంతంగా ధూళిపాళ్ల సైకిల్ యాత్ర

విశాలాంధ్ర-పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి, వెల్లలూరు, మునిపల్లె, తాడిపర్రు గ్రామాలలో గురువారం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సైకిల్ యాత్ర ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ఆయా గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ధూళిపాళ్ల సైకిల్ యాత్రకు అనూహ్య స్పందన లభించింది. పలు గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-మంగళగిరి : భారత్‌లో బ్రిటీషు పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు జాలాది నవీన్ బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాలాది నవీన్ మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించి యావత్ భరత జాతిలో పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు షహీద్ భగత్ సింగ్‌ను అశేష భారత జాతి గుండెల్లో పెట్టుకొందని అన్నారు. భగత్ సింగ్ జీవితం నుంచి ప్రతిఒక్కరం స్ఫూర్తి పొందాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హానోక్ బాబు, అజయ్ కుమార్, మోహన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

రుణాలు తీసుకొని నష్టపోవద్దు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రైతులు, ఖాతాదారులు ప్రైవేట్ సంస్థల్లో అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని ఆర్థికంగా నష్టపోవద్దని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి(డి.డి.యం.) జిల్లా డవలప్‌మెంట్ మేనేజర్ అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహాయంతో అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఫిరంగిపురం సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో అధిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. అవార్డు సంస్థ డైరెక్టర్ యం.రమణయ్య అధ్యక్షతనలో జరిగిప ఈ కార్యక్రమానికి నాబార్డు డిడియం ముఖ్య అతిధిగా హాజరై మండలంలో, వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులకు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. బ్యాంకులోనే రుణాలు తీసుకొని సులభ వాయిదాలతో అతి తక్కువ వడ్డీలు చెల్లించి మేలు పొందవచ్చన్నారు. గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీ పథకాలు గురించి వివరిస్తూ అధికారులను సంప్రదించి ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత నిపుణులు రఘు రామయ్య, శ్రీనివాసరావు, రైతులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

'సెప్టెంబర్ 27' చీకటి దినం: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : శాసనసభలో జీపీఎస్ బిల్లు ప్రవేశపెట్టిన 'సెప్టెంబర్ 27' రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు చీకటి దినమని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు అన్నారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా ముఖ్యనాయకుల సమావేశం గుంటూరు ఎస్టీయూ భవన్‌లో గురువారం ఉదయం జరిగింది. జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధీర్ బాబు మాట్లాడుతూ జీపీఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్ రద్దయ్యే వరకు కలిసివచ్చే సంఘాలతో ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వలన గత మూడు నెలలుగా ఉపాధ్యాయులు జీతాలు అందక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించి జీతాలు చెల్లించుటకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు వి.ప్రసాద్, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, కెనడి, జేవీఎస్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా, భగత్‌సింగ్‌కు ఘననివాళి

విశాలాంధ్ర-పెదనందిపాడు: నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మభూషణ్ గుర్రం జాషువా 128వ జయంతి, విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలోని చెన్నుపాటి వెంకట సుబ్బయ్య మీటింగ్ హాల్‌లో గురువారం వారి సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కొత్తా శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ఎస్టీయూ నాయకులు గేరా మోహనరావు, సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబులు, భగత్ సింగ్ చిత్రపటానికి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.యశ్వంత్, రైతు సంఘం మండల నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, సలీం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మద్దూరి రమణ, చిరంజీవి మాష్టారు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో: ఏఎన్‌యూలో ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంబీఏ విభాగంలోని ఇంటర్ నేషనల్ బిజినెస్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ చంద్రశేఖర్ చేతుల మీదుగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు నాసరయ్య మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా విగ్రహం విశ్వవిద్యాయంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అవినాష్, శ్రీను, దిలీప్, అశోక్, చైతన్య, దినేష్, జానకి రామ్, విజయ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మంగళగిరి : నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యం నేటితరం చదవాల్సిన అవసరం ఉందని, ఆయన గొప్ప కవి అని టీడీపీ నేతలు కొనియాడారు. గుర్రం జాషువా జయంతి సంధర్భంగా మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ కులభావన ఉన్న భారతదేశంలో ఆర్థిక, రాజకీయ విప్లవం కంటే ముందుగా సాంఘిక విప్లవం రావాల్సిన అవసరం ఉందని జాషువా చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరు అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, ఏవీ రమణ, పరుచూరి కృష్ణ, దేవినేని శంకర్ నాయుడు, హసన్ భాషా, వందనాదేవి, ప్రసాద్, ఎస్పీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుంటూ రు జిల్లా కోర్టు ప్రధాన ముఖద్వారం వద్ద గురువారం 'న్యాయవాదుల పరిరక్షణ చట్టం'కై నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జె.నరసింహారావు(జేఎస్ఆర్), జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి సత్యనారాయణ, దాసరి ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు కుమారి నంద, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శిద్ధ సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యం న్యాయవాదులపై దాడులు, అక్రమ కేసులు, హత్య గావించబడటం లాంటి సంఘటనల వల్ల న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకొనివచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ రూ.10 లక్షలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్‌కు కేటాయిస్తానన్న రూ.75 కోట్లు వెంటనే కేటాయించాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, స్థానిక కోర్టులో, బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులకు, కక్షిదారులకు మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం రెగ్యులర్‌గా విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలని తదితర న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా నాయకులు, న్యాయవాది, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు ఎం.మల్లికార్జున రావు, కేదారి నరసింహం, మహిళా న్యాయవాదులు వెంకటరమణ, పి.రచన, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో కొంతమేర గుండె జబ్బులు దూరం: డా॥అనురాగ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజలకు గుండె జబ్బులు గురించి అవగాహన కల్పించటానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న 'వరల్డ్ హార్ట్ డే'గా ప్రకటిస్తుందని లలితా సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవ శర్మ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ దినోత్సవం సందర్భంగా లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు 28, 29 తేదీలలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఉచిత బీపీ, బ్లడ్ షుగర్ అండ్ లిపిడ్స్, ఈసీజీ, అథెరోస్క్లెరోటిక్ కార్డియో వాస్కులర్ రిస్క్ స్కోర్, డైట్ అడ్వైజ్‌లు, కార్డియాక్ కన్సల్టేషన్ చూస్తారన్నారు. గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గుండె సంబంధిత సమస్యతలతో బాధపడుతున్న సుమారు 500 మంది ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం అడ్వాన్స్‌డ్ కార్డియోవాస్కులర్ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ పోలవరపు మాట్లాడుతూ గుండె జబ్బుల గురించి అవగాహన ఉంటే ముందుస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ప్రతి సంవత్సరం 2కోట్ల మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. స్మోకింగ్ చేయడం, పొగాకు నమలడం, ఫ్యామిలీ హిస్టరీ, అధిక కొలెస్ట్రాల్, డ్రగ్స్ వాడకం, బీపీ, షుగర్, హై బీఎంఐ, వాయు కాలుష్యం వంటి వాటికి లోను కావడం వల్ల మన దేశంలోని యువత గుండె జబ్బులకు కారణమవుతున్నారని వివరించారు. రెగ్యులర్ వ్యాయామం, ధూమపానం, ఆల్కాహాలు మానేయడం, కార్బొహైడ్రేట్స్ ఉన్న వాటిని తక్కువగా తీసుకోవడం, తక్కువ కొవ్వు కలిగిన ఆహారం తీసుకోవడం, మానసిక ఒత్తిడిని అధిగమించడం, ఆరోగ్యకరమైన బరువు, బీపీ కంట్రోల్‌లో ఉంచుకోవడం, షుగర్ స్థాయిని నియంత్రణలో ఉంచుకుంటే గుండె జబ్బుల బారినపడకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో లలితా హాస్పిటల్ కార్డియాలజీ బృందం డాక్టర్ ఫణి, డాక్టర్ మాధురి, డాక్టర్ వికాస్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ మధు తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మహాకవి 'గుర్రం జాషువా'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు నుడికారానికి గుడి కట్టిన మహాకవి గుర్రం జాషువా అని జాషువా కళాపీఠం అధ్యక్షులు, మాజీమంత్రి, గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ కొనియాడారు. గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా స్థానిక కన్నావారితోట జిల్లా కోర్ట్ సర్కిల్‌లోని జాషువా విగ్రహం వద్ద జాషువా కళాపీఠం అధ్యక్షులు డొక్కా ఆధ్వర్యంలో జయంతి' వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, గ్రంధాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఏఎంసీ డైరెక్టర్ ప్రభు, గనిక ఝాన్సీలతో కలిసి డొక్కా మాణిక్యవర ప్రసాద్ జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న శకాన్ని ప్రారంభించిన మహాకవి జాషువా అని, తెలుగు భాషకు గౌరవాన్ని తీసుకొచ్చి తెలుగు పద్యానికి పట్టాభిషేకం కట్టిన మహోన్నతుడు గుర్రం జాషువా అని ప్రశంసించారు. మేయర్ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ జాషువా జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనకోవడం శుభపరిణామమని, కవిగా, సమాజ సంస్కర్తగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి జాషువా అని అన్నారు. జాషువా కవితలు నేటి యువత నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా కళాభిమానులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 15వ రోజుకు చేరుకున్నాయి. "బాబుతో -నేను" పేరుతో నియోజవర్గ ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య కూర్చున్న వారికి పూలదండలు వేసి దీక్షలను ప్రారంభించారు. అక్రమంగా అరెస్టు చేసిన చంద్రబాబును త్వరగా విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. రాష్ట్ర కృష్ణబలిజ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలియజేశారు. సాయంత్రం రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రిలే నిరాహారదీక్షలో కూర్చున్న వారిలో నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, నియోజకవర్గ ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి భూక్య భూపతి నాయక్, మంగళగిరి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు పెరం ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఇబ్బందులు తప్పవు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్ డైరెక్షన్‌లో పని చేసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టిన అధికారులు భవిష్యత్తులో న్యాయస్థానాల్లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర హెచ్చరించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ కోవెలమూడి రవీంద్ర(నానీ) ఆధ్వర్యంలో గురువారం అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఎదురు న్యాయవాదులు, నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకల రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్ట్, ఆ తరువాత టీడీపీపై సాగిస్తున్న కక్షపూరిత ధోరణులను ప్రజలు పరిశీలిస్తున్నారన్నారు. వైసీపీ పాలనకు చరమగీతం పలికేందుకు ప్రజలు రోడ్డు మీదకు వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు హాజరై నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ చేసారు. న్యాయవాదులు చుక్కపల్లి రమేష్, రాజీవ్ ఆనంద్, కట్టా కాళిదాస్, కే.నారాయణ, అనిల్, శివలీల, సుబ్బారావు, శంకరరావు, మహతి, సరిపుడి నాగేశ్వరావు, రవీంద్ర బాబు, తల్లమ్ శేఖర్, వడ్లమూడి వెంకటేశ్వరావు, పప్పుల దేవదాస్, జనసేన నాయకురాలు రజిని హాజరయ్యారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర, తెనాలి : అఖిల భారత విద్యార్థి సమైఖ్య (ఏఐఎస్ ఎఫ్) ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గంలో గురువారం సర్దార్ భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్‌లో విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కలసి భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ సర్దార్ భగత్‌సింగ్ చిన్న వయసులో దేశ స్వతంత్ర ఉద్యమంలో ఒక క్రియాశీల పాత్ర వహించి భావితరాల భవిష్యత్తు కోసం తన ప్రాణాలను అర్పించారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకై యువత పోరాటాలు సాగించాలని కోరారు. పట్టణ కార్యదర్శి గండు శివ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల గురించి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూరు సాయి, మద్దినేని కిరణ్‌బాబు, తాండూరు భూమేష్, యశ్వంత్, వినయ్, సాయి, కుంభ రవితేజ, బిల్లా రాజేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డికి పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు: నగరంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డికి ప్రధానం చేశారు. ఈ సాహితీ పురస్కారం ఉత్సవంలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రమణ్యం, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడికి నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆహార వృద్ధిలో భారత్ స్వయం సంవృద్ధి సాధనకు అవిరళ కృషి చేసిన హరిత విప్లవ పితామహుడు ఎంఎస్. స్వామినాథన్ మరణించడం పట్ల తన ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోధుమలు, వరి లాంటి పంటల ఉత్పాదకతను పెంపొందించడానికి నూతన వంగడాలను సృష్టించి భారతదేశానికి ఆహార భద్రతను కల్పించిన మహనీయులు స్వామినాథన్ అని, వ్యవసాయ రంగంలో స్వామినాథన్ చేసిన విప్లవాత్మక కృషికి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు, ప్రపంచ ఆహార బహుమతి పురస్కారం, రామన్ మెగాసెసే పురస్కారాలను అందుకున్నట్లు చెప్పారు. ఎంఎస్. స్వామినాథన్ వ్యవసాయ రంగంలో చేసిన శాస్త్రీయ పరిశోధనలను భారత ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ లాంటి అత్యున్నత అవార్డులను అందించి గౌరవించిందని తెలిపారు. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి మరణించేంత వరకు వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పరిశోధనల ద్వారా 142 కోట్ల ప్రజలకు ఆహార భద్రతను కల్పించారని కొనియాడారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి

విశాలాంధ్ర-మాచర్ల: స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ 116వ జయంతిని సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దె పోగు బాబురావు, ఏఐవైఎఫ్ కార్యదర్శి నర్రా రంగ స్వామి ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అతి చిన్న వయసులో దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అన్నారు. ఆయన ఆశయాలతో నేటి యువత ముందుకు నడవాలని, సమసమాజ స్థాపన కోసం దేశ సమైక్యత కోసం పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో గూడూరి రంగయ్య, మాచర్ల మరియదాసు, సుజాత, మాచర్ల నాగేశ్వరరావు, నర్రా అధిపతి పాల్గొన్నారు.

జాషువాకు ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-వినుకొండ: నవయుగ కవి చక్రవర్తి జాషువా జయంతి సందర్భంగా నరసరావుపేట రోడ్డులోని ఆయన విగ్రహానికి శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొని జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రాంత వాసి అయిన గుర్రం జాషువా తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన కవి గుర్రం జాషువా తెలుగు వారికి ఎన్నో ఆణిముత్యా ల్లాంటి రచనలు అందించారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం దోహదపడుతుందని తెలిపారు.

అనారోగ్యంతో టైలరింగ్ వలి మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు గ్రామానికి చెందిన టైలరింగ్ నేతాజీ యూనియన్ నాయకులు షేక్ వలి(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ వలి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేశ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, వడ్లమూడి అప్పారావు, బెల్లంకొండ రాంగోపాల్‌రావు, గుడిపూడి బాబు, వెల్లలచెరువు సురేష్, గోగులపాటి కోటేశ్వరరావులు వలి భౌతికాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతాజీ యూనియన్ నాయకులు మస్తాన్‌వలి, కొండలు, రమేషు, జాఫర్, సైదా, మీరావాలి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను పంపించే సమయం ఆసన్నమైంది

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి రాష్ట్ర ప్రజల హృదయాలను గాయపరచిన సైకో జగన్‌మోహన్ రెడ్డిని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని పెద్దకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ గురువారం అమరావతిలో రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైకో పోవాలి... సైకిల్ రావాలి... నేను సైతం... అనే నినాదాలతో పార్టీ శ్రేణులు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో షేక్ జానీ, వలివేట్ ధర్మారావు, వెంకట్రావు, భవిరిశెట్టి వెంకటేశ్వర్లు, కన్నదార వసంతరావు, అల్లాబక్షు రాంబాబు, సౌరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ నిరాహార దీక్ష

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేసిన విధానాన్ని, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వ వైఖరిని ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు సత్తెనపల్లి పట్టణంలోని కన్నా క్యాంప్ కార్యాలయంలో రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 16వ రోజు 'రిలే నిరాహార దీక్షలో' మాజీ మంత్రి, సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు అక్రమ అరెస్టును యావత్ ప్రపంచంలోని తెలుగువారందరూ ఖండిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, నాయకులు పూజల వెంకట కోటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో ఆయుష్ ఆరోగ్య మేళ

విశాలాంధ్ర-నూజెండ్ల : కొత్తపాలెం గ్రామంలో గురువారం ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిషనర్ ఎం.బి.కుమార్, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ పద్మ ఆదేశానుసారం ఆయుష్ ఆరోగ్య మేళ నిర్వహించారు. సుమారు 63 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పైన అవగాహన కలిగించి యోగా శిబిరం నిర్వహించి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ ఆయుష్ వైద్య సేవలు అందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య, హెల్త్ విజిటర్ విమల కుమారి, ఎంపీహెచ్ఏ జైనుల్లా, హెచ్‌ఓ పటాన్ మాబు సుభాని, ఏఎన్ఎం జయమ్మ, ఆశా కార్యకర్త రత్తమ్మ, సంధ్యారాణి, యోగ టీచర్ వెంకటాచారి పాల్గొన్నారు.

యువగళానికి భయపడే లోకేష్ టార్గెట్

విశాలాంధ్ర-పెదకూరపాడు : చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి ఇబ్బంది పెడుతున్న తరుణంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభమైతే జగన్‌రెడ్డి ఆట ముగిసిపోతుందనే భయంతోనే వైసీపీ ప్రభుత్వం మరో రాజకీయ కుట్రపన్నారని టీడీపీ నాయకులు వట్టికుంట శేషగిరిరావు గురువారం ఓ ప్రకనటనలో మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఐటీ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అనేక మంది ఉపాధి కల్పించిన నారా లోకేష్‌ను ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో ఇరికించి మరొక అక్రమ అరెస్టుకు వైసీపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఆరోపణ సృష్టించి తెలుగుదేశం పార్టీ నాయకులను అల్లరిపాలు చేయడమే ప్రధాన అజెండాగా రాష్ట్రంలో పాలన సాగుతుందని విమర్శించారు. జగన్ పాలనతో చీకట్లు ఆలుముకున్న ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులు రావాలంటే చంద్రబాబు నాయకత్వమే కావాలన్నారు. జగన్ను మళ్ళీ నమ్మితే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని ఆరోపించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-క్రోసూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమంతంగా ఉండాలని చెంచు కాలనీలో నిర్వహించిన 'దోమలపై పోరాటం-వ్యాధుల పట్ల అప్రమత్తం' అనే కార్యక్రమాన్ని మండల కేంద్రమైన క్రోసూరులోని పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ బిల్ కలెక్టర్ కొంకాయల వీరాంజనేయరెడ్డి. పంచాయతీ కార్యదర్శి పంతులు నాయక్, సర్పంచ్ చందమామ, హెల్త్ సిబ్బంది చంద్రిక పాల్గొన్నారు. 16 వార్డులో దోమలు స్వైర విహారం చేస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు రోగాల బారినపడుతున్నారని చెప్పారు. తక్షణమే అప్రమత్తమై దోమల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ప్రతిపక్షాలపై కక్ష కట్టిన సీఎం జగన్: ముప్పాళ్ల

విశాలాంధ్ర-వినుకొండ: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రభుత్వం పలు ఇబ్బందులు పాలు చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక అరుణ హాల్ సెంటర్లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. గురువారం వినుకొండ వచ్చిన ముప్పాళ్ళ స్థానిక సీపీఐ నేతలతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జగన్మోహన్ రెడ్డి గత నాలుగేళ్లుగా కేంద్రం నుంచి వేల కోట్ల అప్పులు తెస్తూ ఎక్కడ అభివృద్ధి చేయకుండా. రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. దీన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే. చంద్ర బాబుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారని అదే బాటలో మరి కొంతమంది నేతలను అరెస్టు చేసేం దుకు కుట్రలు పన్నుతు న్నారని అన్నారు. ఎటువంటి సాక్ష్యాధారాలు చూపకుండా పోలీసులతో అక్రమ అరెస్టులు చేపిస్తున్నా డని పూర్తిస్థాయిలో పోలీసులే పాలన చేస్తున్నట్లుగా ఉందని, దీనిపై ప్రజా ఉద్యమం తప్పదు అన్నారు. టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, లౌకిక పార్టీలతో కలిసి ఈ నియంత పాలనపై ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ముప్పాళ్ళ అన్నారు. శిబిరంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు, జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏ పవన్ కుమార్, పి.వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.సు బ్బారావు, మల్లికార్జున్‌రావు, ఆర్.వందనం పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర-వినుకొండ: సమాజం మార్పు కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను నేటి సమాజం, స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు అన్నారు. సర్దార్ భగత్ సింగ్. మహాకవి గుర్రం జాషువా. మహమ్మద్ ప్రవక్తల జయంతి సందర్భంగా గురువారం సీపీఐ కార్యాలయం శివయ్య భవన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ప్రసంగించారు. తొలుతగా భగత్ సింగ్. గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వైఎఫ్ మాజీ నాయకులు పి.లాల్ ఖాన్ అధ్యక్షత వహించగా ముప్పాళ్ళ ప్రసంగిస్తూ ఆనాడు సమ సమాజం కోసం బ్రిటిష్ వారిని గడగడలాడించి.. చిరు ప్రాయంలోనే ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే వినకొండ ప్రాంతానికి చెందిన మహాకవి గుర్రం జాషువా సమ సమాజం కోసం కుల వివక్షపై తన కలం ద్వారా సమాజాన్ని మేల్కొల్పాడని అన్నారు. అలాగే మహమ్మద్ ప్రవక్త అందరూ సమానమేనంటూ కులమతాలకు వ్యతిరేకంగ ఎంతో శ్రమించారని అన్నారు. కాగా నేడు కేంద్రంలో నరహంతకులైన ప్రధాని మోడీ అమిత్ షాలు మతం పేరుతో లౌకిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ బడా బాబులకు అప్పజెబుతూ కార్మిక వర్గాన్ని రోడ్లపాలు చేస్తున్నారని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నింటి అన్ని వర్గాల ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఇక రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆనాడు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆర్థిక గజదొంగగా మారి జైలు పాలై తిరిగి సానుభూతితో గెలిచి ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకుంటున్నాడని ఆయన అన్నారు. మంత్రులు మద్యం, ఇసుక, ఖనిజ సంపదపై దృష్టి పెట్టి కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల కుప్పగా మార్చి ప్రతిపక్షాలపై రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమయంలో కమ్యూనిస్టు పార్టీలు చట్టసభల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకు ప్రజలు చైతన్యవంతం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల్ని బానిసలుగా మార్చి నియంత పాలన కొనసాగిస్తున్నదన్నారు. అలాగే అధిక ధరలపై గ్యాస్ బండలతో అక్టోబర్ రెండో తేదీన ఆందోళన కార్య క్రమం చేపడుతున్నట్లు అది వినుకొండలోనే ముందుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ రూ.5వేలు ఇవ్వాలని, వికలాంగుల పెన్షన్ రూ7వేలు చేయాలని, లీటర్ పెట్రోల్ ధర రూ.60, డీజిల్ రూ.50 చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయనున్నట్లు ఆయన తెలిపారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన సర్దార్ భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే ఆనాడు పార్లమెంటుపై బాంబు విసిరి ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందారన్నారు. కడవరకు దేశ ప్రజల కోసం బ్రిటిష్ వారిపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఇక గుర్రం జాషువా అంటరానితనంపై తన కలం ద్వారా సమాజంలో మార్పు కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం సుబ్బారావు, పి లాల్ ఖాన్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బూదాల సాగర్ బాబు, ఉట్ల రామయ్య, పి వెంకటేశ్వర్లు, ఏ పవన్ కుమార్, ఆర్ వందనం, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత కవి గుర్రం జాషువా

విశాలాంధ్ర-అమరా వతి : దేశ స్వాతంత్ర ఉద్యమంతో పాటు నిమ్నజాతి, వెనకబడిన వర్గాల హృదయాలలో జీవనజ్యోతిని వెలిగించేందుకు నిరంతరం పరితపించిన మహోన్నత విశ్వకవి గుర్రం జాషువా అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ కొనియాడారు. గురువారం అమరావతిలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ 1895 సెప్టెంబర్ 28వ తేదీన జన్మించిన గుర్రం జాషువా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. జాషువా కవిత్వం ప్రపంచవ్యాప్తంగా వెన్నెల తుఫానుగా నిలిచిందన్నారు. మనిషిని పట్టి పీడించే ఎన్నో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల్ని ఎత్తిచూపుతూ కుల, మత, వర్గ, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా... దేశ స్వాతంత్ర ఉద్యమంలో బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘమైన కవితల ద్వారా మకుటం లేని మహారాజుగా వెలుగొందారన్నారు. నేటికీ సత్యహరిశ్చంద్రుడు నాటకంలో కాటిసీనులో జాషువా పద్యం లేనిదే నాటక ప్రదర్శన లేని పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఆయన ఆశయ బాటలో కళాకారులు ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బత్తైన రామయ్య, జి.పానయ్య, ఆదినారాయణ, పూర్ణయ్య, కె.మంత్రాలు, యుగంధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రామయ్య, శివశంకరు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-అమరావతి : బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జన చైతన్య సమితి నిర్వాహకులు వెలుతోటి అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో మహిళల నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రంలో గురువారం విప్లవ వీరుడు భగత్ సింగ్ 116వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టం భాస్కరరావు, శ్రీనివాస్, కర్ల భూలక్ష్మి, కళ్యాణి పాల్గొన్నారు.

హాస్పిటల్‌కు ల్యాబ్ మిషనరీ అందజేత

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఏరియా ప్రభుత్వ వైద్యశాల రక్తపరీక్ష కేంద్రానికి రూ.22 వేల విలువ గల ల్యాబ్‌లో అవసరమైన సెంట్రీ ఫ్యూజ్‌ను ఎస్‌కే ఫిట్‌నెస్ సెంటర్ జిమ్ సహకారంతో గురువారం అందజేశారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ అనునిత్యం పేషంట్లతో ఉంటున్నారని, వారందరికీ సకాలంలో ల్యాబ్ టెస్టులు చేయాలంటే ఇప్పుడున్న ఒక పరికరం సరిపోవట్లేదని, సెంట్రీ ఫ్యూజ్ కావాలని ల్యాబ్ ఉద్యోగులు కోరడంతో వెంటనే స్పందించి ఎస్‌కే ఫిట్‌నెస్ వారు అందించారని తెలియజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకులు నాగు, కిరణ్ హాస్పిటల్ ల్యాబ్ సిబ్బంది అలీ, రామకృష్ణ, చందు పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో తిరుగుబాటు

విశాలాంధ్ర-నరసరావుపేట: నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలపై సర్దార్ భగత్ సింగ్ స్ఫూర్తితో తిరుగుబాటు బావుటా ఎగురవేయడానికి యువత సిద్ధం కావాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని పిలుపు నిచ్చారు. సర్దార్ భగత్ సింగ్ నూట పదహారవ జయంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తి చేయడానికై 23 ఏళ్ల చిరు ప్రాయంలోనే ప్రాణాలర్పించిన అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ అని కొనియాడారు. నాటి యువతను ఉత్తేజపరిచిన నౌజవాన్ భారత్ సభ, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ కార్యక్రమాల్లో భగత్ సింగ్ కీలకపాత్ర పోషించారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్‌లి మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను మోసం చేస్తూ, అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను యువత కలిసికట్టుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి నిరుడి ఆనంద్, జగన్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు కోటను సందర్శించిన డాక్టర్ జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-యడ్లపాడు : మండల పరిధిలోని కొండవీడు కోటను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి గురువారం సందర్శించారు. కలెక్టర్ శివ శంకర్ లోతేటి, పల్నాడు జాయింట్ జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర అటవీ శాఖ దళాధిపతి వై.మధుసూధన రెడ్డి అనుసరించారు. కొండవీడు కోటలో మొక్కలు నాటి, విల్లుపట్టి బాణాలను సంధించారు. చెరువును పరిశీలించారు. తేనేటి విందు స్వీకరించారు. కొండవీడు కోట ప్రాంతం మొత్తం అధికారుల సందడి నెలకొని ఉంది. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక స్థాయి కల వెయ్యి సంవత్సరాల చరిత్ర కల ఇక్కడి కొండవీడు కోటలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టంచేసారు. ఏకో పోర్ట్ నిర్మాణాన్ని, అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేసినట్లు వివరించారు. స్థానిక నాయకులు, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి, అటవీశాఖ అధికారి రామచంద్ర రావు, టూరిజం శాఖ అధికారి బీజే బెన్నీ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోకకళ్యాణ కోసమే అనంత పద్మనాభ స్వామి వ్రతం

విశాలాంధ్ర-పెదకూరపాడు : 75 తాళ్లూరు గ్రామంలో అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో గురువారం గాయత్రి మాత ఉపాసకులు అంకారావు మాస్టారు పాల్గొని మహిళా భక్తులచే అనంత పద్మనాభ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన

సంఘీభావం తెలిపిన సీపీఐ

విశాలాంధ్ర-వినుకొండ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తు జిల్లా టీడీపీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం వినుకొండ పట్టణంలో మౌన ప్రదర్శన చేపట్టారు. టిడిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో మూతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడనుండి టిడిపి శ్రేణులు క్రమశిక్షణగా మౌన ప్రదర్శన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తూ విధ్వంసకర వాతావరణం సృష్టించిన సైకో జగన్ రెడ్డి తన గొయ్యి తానే తవ్వు కున్నాడని, పోయేకాలం దాపురించి ఇలాంటి ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు అక్రమంగా, అప్రజాస్వామికంగా అరెస్టు చేశారని దేశంలోని ప్రముఖులతో పాటు, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రజలు ఖండిస్తూ నిరసనలు తెలియజేస్తున్నారని వివరించారు. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు కేసులు అరెస్టులు చంద్రబాబు నాయుడును, టిడిపి శ్రేణులను భయపెట్టలేరని వైసీపీ అరాచక విధానాలను ఎదుర్కొని రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి అండగా నిలిచి పోరాటం చేస్తారని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ, దుర్మార్గపు, అవకాశవాద, కుట్రపూరితమైన పద్ధతులకు పాల్పడుతున్నారని అనడానికి ప్రతిపక్ష నేత అక్రమ అరెస్టే పరాకాష్టగా మారిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కిన మూడవ రోజే ప్రజా వేదిక కూల్చివేత, అమరావతి రాజధానిపై అక్కసు, ప్రశ్నించిన ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై అక్రమ కేసులు, అరెస్టులు, గృహనిర్బంధాలు ప్రజా వ్యతిరేక పాలన ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని అంతమొందించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉండి వైసిపి ప్రభుత్వం దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజా ఉద్యమాన్ని తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ నాయకులు మారుతి వరప్రసాదరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు మానుకొండ శివప్రసాదరావు, ఈపూరు మండల టీడీపి నాయకులు గన్నమనేని వెంకయ్య, రాపర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షులు తిరుమల శెట్టి బాలయ్య, గడిపుడి వేణు,శేషగిరి రావు,రామకృష్ణ, రామయ్య,కాటమ వెంకట రమకొటేశ్వరావు,అంజయ్య, అయినాల కోటేశ్వరరావు, సంతరావు, శ్రీనివాసరావు, నర్రా కిషోర్, బోల్ల సుబ్బారావు, నూతక్కి వెంకయ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జాషువా, భగత్‌సింగ్‌లకు నివాళి

విశాలాంధ్ర-వినుకొండ: విశ్వ నరుడు, కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి మహాకవి గుర్రం జాషువా మరియు స్వాతంత్ర్య సమరయోధుడు విప్లవ యువకిశోరం సర్దార్ భగత్ సింగ్ జయంతిని ఘనంగా యువజన విద్యార్థి సంఘాలు, సీపీఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వినుకొండ పట్టణంలోని శివయ్య భవన్లో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ యువజన సంఘం నాయకులు పటాన్ లాల్ ఖాన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ స్వాతంత్ర్య ఉద్యమంలో యువతరాన్ని ఉరకలెత్తించి తెల్లవారిని గడగడలాడించారని, దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబమెక్కి తన ప్రాణాలను సైతం తృణప్రా యంగా అర్పించారని కొనియాడారు. మహాకవి గుర్రం జాషువా తన కవితా రచనలతో కులమతాల విచక్షతను అంటరానితనాన్ని రూపుమా పారన్నారు ఆధునిక కవులలో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా అని గబ్బిలం క్రీస్తు చరిత్ర లాంటి మహా కవితా ఖండాలను రచించి ప్రస్తుతి కెక్కారని వారన్నారు. తెలుగు రాష్ట్రాలలో ప్రముఖంగా హరిశ్చంద్ర పద్య నాటకాలు వాటిలో కాటిసీను పద్యాలు ఆయన రచించిన పద కవితా రచనలేనని అన్నారు. అలాంటి ఆదర్శ మూర్తులను ఆదర్శంగా తీసుకొని నేటి యువత దేశంలో పెరిగిపోతున్న కుల మతాల రుగ్మతలను మత ఉన్మాదాన్ని పెచ్చరిల్లకుండా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ యువత ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం వారు పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం వద్ద కల మహాకవి జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్ర మంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ వినుకొండ మండల కార్యదర్శి బూదాల సాగర్ బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నబోయిన వెంకటేశ్వర్లు, ఈపూరు మండలం కార్యదర్శి పూట్ల రామారావు నూజెండ్ల మండల కార్యదర్శి ఏ పవన్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఆర్,వందనం షేక్ కిషోర్ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శశి కుమార్ పేరిపోగు మార్కు షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

సాహితీ లోకానికి కీర్తి శిఖరం జాషువా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సామాజిక అసమానతలను తన సాహిత్యంతో ప్రశ్నించి, సమాజాన్ని చైతన్యపరిచిన గుర్రం జాషువా సాహితీలోకానికి కీర్తి శిఖరమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం విశ్వ నరుడు గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని రైల్వేస్టేషన్ దారిలో ఉన్న జాషువా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ వినుకొండ వీధుల్లో రాణించి విశ్వవేదికపై ఎదిగిన విశ్వనరుడన్నారు. తెలుగువారు విర్రవీగుతూ గర్వంగా చెప్పుకునే వైతాళికుడు జాషువా అని ప్రశంసించారు. సాంఘిక వివక్షతలు, ఆర్థిక అసమానతలు, రాజకీయ అవినీతి, సాంస్కృతిక మౌఢ్యంపై అక్షర శస్త్రాలు సంధించిన జాషువాను స్మరించుకోవటం మన బాధ్యత అన్నారు.

వైసీపీ కార్యాలయంలో: నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో జాషువా జయంతి వేడుకలు జరిగాయి. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చలంచర్ల సాంబశివరావు, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండెం బాబూరావు, శ్రీ కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ అధ్యక్షులు పి.ఇర్మియ, మక్కెన అచ్చయ్య, అచ్యుత శివప్రసాద్, కట్ట సాంబయ్య, చిలక జైపాల్ రమణయ్య, యాసారపు బాబు, జొన్నలగడ్డ ఆనంద్, తుమ్మల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో: కవికోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం సత్తెనపల్లి రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ సాహితీ రంగంలో జాషువా చేసిన సేవలు ఎనలేనివన్నారు. సామాజిక రుగ్మతలను ఎండగట్టడంలో తనదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, జాషువా సాహితీ సేవా సంస్థ అధ్యక్షుడు పి.యిర్మీయా, ఎస్టీయూ నేత సాల్మన్ రాజు, జి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో: సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కవి కోకిల గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్ అధ్యక్షత వహించారు. దళిత మహాసభ ఉపాధ్యక్షులు కొరబండి ఆంథోని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, చాంద్ భాషా, దావులూరి కోటేశ్వరరావు, జిల్లెల్ల పాల్ రాజు, కోటా ఆనంద్, కూచిపూడి జాన్ బాబు, పురుషోత్తం, సిద్దెల మోహన్ రావు, జెట్టి శేఖర్, షేక్ సుభాని, షేక్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో: పద్మభూషణ్, నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, కళాప్రపూర్ణ, కవిత విశారద, కవి దిగ్గజ గుర్రం జాషువా జయంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని వారి విగ్రహానికి మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చౌటా శ్రీనివాసరావు, యల్లనేడి రామస్వామి, కటకం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో: గుర్రం జాషువా రచనలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని, నేటితరానికి ఆయన స్ఫూర్తిప్రదాత అని గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ తెలిపారు. గుర్రం జాషువా జయంతిని గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయం ఎదుట ఉన్న జాషువా విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక పట్టణ అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, కోశాధికారి బి.రాంబాబు నాయక్, వైసీపీ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బి.అంజిబాబు నాయక్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాచపూడి వెంకట్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, వెంకట బుల్లోడు, బి.వెంకట్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తుర్లపాటి వెంకట నగేష్, విశ్రాంత ఉపాధ్యాయులు తన్నీరు వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు సలికి నీలి నాగరాజు, చుండూరి ఆనందబాబు, అనిల్ బాబు పాల్గొన్నారు.

మహాకవి జాషువా సిద్ధాంత భూమిక ఆధ్వర్యంలో..

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మహాకవి జాషువా సిద్ధాంత భూమిక ఆధ్వర్యంలో గురువారం మహాకవి జాషువా 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చుక్కా విన్సెంట్ పాల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ హాజరయ్యారు. డాక్టర్ పీవీ సుబ్బారావు, ఎస్.కొటేశ్వరావు, బి.అజయబాబు, నల్లపు కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా ప్రముఖ సాహితి వేత్తలు, శ్రీనాద సాహిత్య పరిషత్ అధ్యక్షులు స్వర్ణ చిన రామిరెడ్డి(నరసరావుపేట), పుడమి సాహితి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి (నల్గొండ), కవి, గాయకులు డాక్టర్ పల్లె కిషోర్ కుమార్(నల్గొండ), జానపద గాయని కమెర పద్మ(జనగామ, తెలంగాణ), కవి, గాయకుడు ఈపూరి వెంకట రెడ్డి(నరసరావుపేట), రావూరి భరద్వాజ బాలల విజ్ఞాన పీఠం కార్యదర్శి ఏ.గురులింగం(చిలకలూరిపేట), కవి, రచయిత గాయకులు డాక్టర్ పి.పార్థసారధి(ఏలూరు)లకు జాషువా అవార్డు ఇచ్చి ఘనంగా సత్కరించారు. సిద్ధాంత భూమిక అధ్యక్ష, కార్యదర్శులు దారా కొండయ్య, దార్ల బుజ్జిబాబు, బి.మాన్ సింగ్ నాయక్, బొంత రవికుమార్, పాపయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి జగన్ సంకెళ్ళు

విశాలాంధ్ర-పెదకూరపాడు : ముఖ్యమంత్రి జగన్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యా నికి సంకెళు వేస్తున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, పెదకూరపాడు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రామాపురం గ్రామంలో బాబుతో నేను... బాబు వెంట నేను అంటూ చంద్రబాబు అక్రమ అరెస్టు, బాబు వస్తే భవిష్యత్ గ్యారంటీపై గురువారం ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు వివరించారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు బెల్లంకొండ రాంగోపాల్‌రావు, వడ్లమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PADARTI LAKSHMI SUDHA SRI (Old Name) W/o. **PADARTHI RAJA.** Doing House Wife Resident Of D.No. 1-1-1-16/10, Mitta Bazar, Barampeta, Narasaraopet, Palnadu Dist. Pin 522601. Has Changed My Name to **PADARTHI LAKSHMI SUDHASRI** (New Name) Hereafter My Name Known as **PADARTHI LAKSHMI SUDHA SRI.**

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

సామాజిక చైతన్య ఉద్యమకారుడు గుర్రం జాషువ

జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : మహాకవి గుర్రం జాషువా గొప్ప సామాజిక చైతన్య ఉద్యమకారుడుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన గుర్రం జాషువా చిత్రపటానికి ఆయన పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పిరదౌసి, గబ్బిలం వంటి ఎన్నో రచనలతో ప్రజల ఆలోచనలలో మార్పు తెచ్చారని వివరించారు. జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె.రాజదిబోర, కలెక్టరేట్ ఏవో గోపికృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం మండలానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ దబ్బుకూటి శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రతిభా పురస్కారం లభించిం ది. వరల్డ్ టూరిజం డే సెలబ్రేషన్ లో భాగంగా స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ సీసీఎల్ఏ కమ్ సెక్రటరీ సీఈఓ ఆఫ్ సెర్ప్ ఎండీ ఇంతియాజ్ చేతుల మీదుగా శ్రీనివాసరావు ఈ పురస్కారంను అందుకున్నారు. గతంలో భీమడోలు ప్రాంతంలో జరిగిన జాతీయస్థాయి ఫోటోగ్రఫీ వర్క్ షాప్ లో శ్రీనివాసరావు ప్రథమ బహుమతి పొందారు.అలాగే పాట్వ వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా కూడా ప్రతిభా పురస్కారం సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభా పురస్కారం అందుకున్న శ్రీనివాసరావును ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల వెంకట హరినాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సొసైటీ ప్రెసిడెంట్ మరక శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ పి.వాసుదేవరావు, జీడీసీసీ ఛైర్మన్ మదన్ భాగ్యలక్ష్మి అభినందించారు.

జాషువాను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు అదేశాలు మేరకు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో గురువారం గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా పట్టణంలో స్థానిక ఎ.బి.యం హైస్కూల్ ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహా నికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. రాజేష్ మాట్లా డుతూ నేటి యువతరం గుర్రం జాషువాను ఓ స్ఫూర్తిగా తీసుకో వాలన్నారు. దశాబ్దాలుగా ఎందరో కవులకు వెన్నుదన్నుగా ఉన్న ఓ మహా గొప్ప వ్యక్తి జాషువా అని కొనియాడారు. తక్కువ కులంగా భావించబడ్డ కులంలో జన్మించినందున అయన అనేక అవమానాలు ఎదుర్కొన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో బక్కా రోశయ్య, దోనేపూడి రవి, నక్కల రాంబాబు, గాంధీ, శీలం సాగర్, తాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - నాగులుప్పలపాడు : మండల కేంద్రమైన నాగులుప్పల పాడు బస్టాండ్ కూడాల్లో నిర్మిస్తున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య నాగులుప్పలపాడులో విగ్రహ నిర్మాణ కమిటీకి గురువారం రూ.20,000 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు, గ్రంథాలయాలు సాహిత్యాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంబేద్కర్ ఆశించిన స్వేచ్ఛ సమానత్వం సౌభ్రతత్వం ద్వారా సమసమాజ స్థాపన జరిగినప్పుడే విగ్రహ నిర్మాణాలకు ఓ అర్థం ఉంటుందన్నారు.

రోడ్డుపై గుంతలు-అధికారుల కళ్లకు గంతలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఇదీ చీరాల నుండి బాపట్ల, గుంటూరు, విజయవాడ వెళ్ళే ప్రధాన రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణం చేస్తూ ఉంటాయి. అది ఉన్న ప్రదేశం మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో ఉన్న రహదారులు, భవనాలు శాఖ రోడ్డు. కానీ రహదారులపై గుంటలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రద్దీ రోడ్డు కావడంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు గుంటల్లో పడి దెబ్బలు తగిలించుకుంటున్నారు. వాహనాలు దెబ్బ తిని మరమ్మత్తులకు అధిక ఖర్చులు అవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా గుంటలలో నీరు నిలిచి గుంట ఏదో రోడ్డు ఏదో తెలీక ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వాహనం ప్రయాణించాలంటే భారీ యెత్తున టాక్సులు వసూలు చేసే ప్రభుత్వం కనీస సౌకర్యాలు గాలికి వదిలేసింది అని ప్రజలు చర్చించు కుంటున్నారు. కొద్దిపాటి శ్రద్ధపెట్టి మరమ్మత్తులు చేయడానికి కావలసిన నిధులు మంజూరు చేస్తే రోడ్డుకు మరమ్మత్తులు చేసే చర్యలు చేపట్టవచ్చు. కానీ అధికారులు కళ్ళకు గంతలు కట్టుకుని ఆ దిశగా ఆలోచించక పోవడం ఏమని సమర్థించు కుంటారు అని ప్రజల ఆలోచన. దీనికి కారణం స్పందన లేని పాలనా యంత్రాంగమా..? పట్టించుకోని ప్రజా ప్రతినిధులా...? తిలాపాపం తలా పిడికెడు... ప్రజలకు తిప్పలు తప్పవుగా అని సామాన్యుని సణుగుడు. ఈ ఇబ్బందులు ఎప్పటికి తొలిగేనో అని ప్రజలు వాపోతున్నారు.

గ్యాంగ్ రేప్ నిందితులను శిక్షించండి

విశాలాంధ్ర - చీరాల : యువతిని నమ్మించి గ్యాంగ్ రేప్‌కి పాల్పడిన యువకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పలువురు విద్యార్థులు అన్నారు. గురువారం పెనుమూరులో ఇంటర్ చదువుతున్న భవ్యశ్రీ ని గ్యాంగ్ రేప్ చేసిన యువకులను కఠినంగా శిక్షించాలని చీరాలలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద ఉన్న అంబేద్కర్ సచివాలయం వద్ద నుంచి గడియార స్తంభం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వల్లెపు బాల అంకమ్మ రావు, కోళ్ల కిరణ్ బాబు, తన్నీరు విజయ్, సాయికుమార్, కుప్పల వెంకటేష్, కావూరి మణికంఠ, మేడిబోయిన మణికంఠ, తాండ్రపాటి రసూల్, తరుణ్, మారిపోయిన గోపి, పోగులు రాజు, కావూరి వంశీ, గుణమిని దినేష్ నీలా కుమార్ పాల్గొన్నారు.

గుర్రం జాషువా రచనలు అనుసరణీయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సమాజ వాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నవయుగ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మభూషణ్ పురస్కారం పొందిన గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా సమాజ వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు పట్టణంలోని ఏబీమ్ హైస్కూల్ దగ్గర గుర్రం జాషువా విగ్రహా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. బహుజన మేధావి విలియం బూత్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్ మాట్లాడుతూ గుర్రం జాషువా జీవితం తెరిచిన పుస్తకమని బహుజనుల చైతన్యానికి అవసర మైన రచనల ద్వారా సమసమాజ అభివృద్ధికి ఎంతో కృషి చేశారున్నారు. రాష్ట్ర నాయకులు ఎనుముల భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ సాహిత్యపరంగా అగ్రవర్ణాల ఆధిక్యత కొనసాగుతున్న రోజులలో తన ప్రతిభ ద్వారా మెప్పించుట జాషువా ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు, జిల్లా నాయి బ్రాహ్మణ సంఘ కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య ముస్లిం మైనార్టీ నాయకులు నాగూర్, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు మారం రవి కుమార్, జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యదర్శి తోట దుర్గారావు, బహుజన నాయకుడు శరత్, ప్రముఖ న్యాయవాది బీసీ నాయకుడు లంబు సాంబయ్య, యాదవ సామాజిక నాయకుడు దర్శి భాస్కరరావు, బీసీ సంక్షేమ సంఘ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి ఐటీ విభాగం ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల : బీసీలను అభ్యున్నతికి ఉపయోగపడేలా తమ సంఘంలో ఐటీ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయన జిల్లా ఐటీ విభాగం ఇన్చార్జిగా అంగలకుదురు రవీంద్రను నియమిస్తూ ఎంపిక పత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ మాట్లాడుతూ బీసీలు త్వరలోనే రాజకీయ పార్టీలకు దీటుగా సమాధానం చెప్పేలా జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం ప్రసాద్ ప్రణాళిక రూపొందించారన్నారు.నూతనంగా ఎంపికైన రవీంద్ర ఐటీ విభాగంలో చురుకుగా పనిచేసే నాయకులను బల పరుస్తూ సంఘ ఐక్యతకు కృషి చేయాలని సూచించారు. తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు శివరాం ప్రసాద్. ప్రధాన కార్యదర్శి రవికుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో బీసీల ఐక్యతను చాటేందుకు యాప్ ను ఆవిష్కరించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు ద్వారకా శ్రీను, ప్రధాన కార్యదర్శి కే హనుమంతరావు, పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి జరగాలని శ్రీకృష్ణుడికి పూజలు

విశాలాంధ్ర -రేపల్లె : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే దీక్షలు 15 వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు యాదవులు దీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని యాదవ సామాజికవర్గం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. అధికార గర్వంతో మంచి వారిని హింసిస్తున్న రాక్షస మూకలు మూల్యం చెల్లించుకునే రోజులు త్వరలోనే వస్తున్నాయని అన్నారు. అనంతరం మేము సైతం బాబుతో అంటూ.. మనుష్యుల రూపంలో ఉన్న పశువులకు తగిన జ్ఞానం ఇవ్వాలని నినాదాలు చేశారు. శిబిరం వద్దకు ఆవుని, శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఉన్న చిన్నారులను తీసుకువచ్చి వినూత్న రీతిలో చంద్రబాబుకు మద్దత్తు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ అణచివేతలు, కేసులు, ఎదురుదాడులు, టీడీపీ ప్రభంజనాన్ని ఆపలేవన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ నియంతృత్వ పాలనకు ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. టీడీపీ నాయకులు అనగాని శివ ప్రసాద్, లీగల్ సెల్ నాయకులు వై.ధర్మ తేజ, వెనిగళ్ళ సుబ్రమణ్యం, నాగమల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక తెలుగు కవుల్లో జాషువాది ప్రత్యేక స్థానం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కవి సామ్రాట్ గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమాజం, వీరాస్వామి ఫౌండేషన్, ఏపూరి బ్రదర్ హుడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన జయంతి సభలో ముఖ్యఅతిథిగా అంటరానిత నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చార్వాక, ఇతర దళిత సంఘాల నాయకులు పాల్గొని మహాకవి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. చార్వాక మట్లాడుతూ ఆధునిక తెలుగు కవులలో ప్రత్యేక స్థానం పొందిన ప్రముఖ కవి గుఱ్ఱం జాషువా అని చార్వాక తెలిపారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు ఏపూరి బాబురావు, ఆహ్వాన కమిటీ చైర్మన్ గొర్రె ముచ్చు వందనం, నేటి జాషువా పురస్కార గ్రహీత దగ్గుమల్లి ధర్మారావు, అదే బుజ్జి , గద్దం ఏలియా, మందపాటి పరమానంద కుమార్, జెఎస్ హెర్బర్ట్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఏ.పి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘం అధ్యక్షులు పి.నరోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల సుబ్బారావు అన్నారు. వారు మాట్లాడుతూ ఉద్యమాలు చేస్తున్న తరుణంలో శాసనసభలో మెజారిటీ ఉన్నందున రాష్ట్రంలో ఉన్న మూడున్నర లక్షల మంది సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయు ల మనో భావాలకు వ్యతిరేకంగా నేడు శాసనసభలో జీపిఎస్ బిల్లును ఆమోదించిందన్నారు. పాత పెన్షన్ విధానం వలన 40 సంవత్సరాల తరువాత ప్రభుత్వంపై పెనుభారం పడుతుందని కాంట్రిబ్యూషన్ పెన్షన్‌లో ప్రభుత్వ కాంట్రిబ్యూషన్‌ను కూడా లేకుండా జీపిఎస్ విధానం తేవడం దారుణమని. స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ తరుపున ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యారంగ నిపుణులకు అభిప్రాయాలకు విరుద్ధంగా ఎస్ఇపిని అమలులోకి తెచ్చారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్..ముఖ్యమంత్రి లక్ష్యం

విశాలాంధ్ర - చీరాల : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్మోహనరెడ్డి లక్ష్యమని, ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది వైయస్ రాజశేఖర్ రెడ్డయితే పునర్జన్మ నిచ్చింది ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని, ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందించాలని ఏపీ ఆరోగ్య స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు కామాక్షి వైద్య సిబ్బందికి సూచించారు.చీరాల శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ను ఏపీ ఆరోగ్య స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి జనరల్, లాప్రోస్కోపీ ఆపరేషన్లు, హెర్నియా,ఎముకల ఆపరేషన్‌లు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి, చెవి, ముక్కుగొంతు ఆపరేషన్ ఉచితముగా చేయబడునని అన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందుతున్న పేషెంట్లను ఏపీ ఆరోగ్య స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గిన్నీస్ రికార్డ్సులో స్థానం కోసం బైకుపై దేశ పర్యటన

విశాలాంధ్ర - చీరాల : ద్విచక్ర వాహనంపై దేశం మొత్తం పర్యటించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్లో స్థానం సాధించేందుకు కృషి చేయడం చిన్న విషయం కాదని ఆయ నను సన్మానించడం యువతకు స్ఫూర్తిదా యకమని వైసీపీ కో ఆప్షన్ సభ్యుడు కబీర్ అన్నారు. చీరాల గడియారం స్తంభం సెంటర్లో దేశ పర్యటనలో గిన్నిస్ రికార్డు సాదించేందుకు కృషి చేస్తున్న వెంకట కార్తీక్ ను చిరాలలో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన వెంకట కార్తీక్ ఫిబ్రవరి 2022లో ద్విచక్ర వాహనంతో దేశం మొత్తం 580 రోజులలో 135 వేల కిలోమీటర్లు పర్యటించి, ప్రణాళిక సిద్ధం చేసుకొని పూర్తి చేశారని, దేశం మొత్తం పర్యటించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించు కునేందుకు ధరఖాస్తు చేసు కున్నారన్నారు. ఇటువంటి యువతను సన్మానించడం వలన ఉన్నత లక్ష్యాలు గల యువతను ప్రోత్సహించినట్లేనని, ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యం కలిగి కృషి చేయాలన్నారు. అనంతరం వెంకట కార్తీక్ మాట్లాడుతూ నేటి యువత సమాజంలోని చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్యలు చేసుకోవడం సమంజసం కాదని,సమస్య ఎంత పెద్దదైన పెద్దలతో,కుటుంబ సభ్యులతో చర్చించి పరిష్కార మార్గాలు చూడాలని, ఈ విషయాలను యువతకు తెలుపుతూ తన పర్యటన సాగిందన్నారు.ఈ కార్యక్రమంలోకబీర్, దేగల చిన్న, మోహన్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జాషువాను యువత ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : జాషువా సాహిత్యం ఈ సమాజానికి దిక్సూచని, యువత జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని, సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను జాషువా తన సాహిత్యం ద్వారా వెలగెత్తి చాటడని జాషువా సాహిత్యం ఈ సమాజానికి దిక్సూచి అన్నారు, యువత జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని అన్నారు, సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను జాషువా తన సాహిత్యం ద్వారా ఎలుగెత్తి చాటారని డాక్టర్ జి వి రత్నకర్ అన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి సభ గురువారం గుర్రం జాషువా సాహితీ సమితి, యుటిఎఫ్, కెవిపిఎస్, జెవివి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల ఎన్జీవో భవనంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు లింగం జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బండి భిక్షాలు బాబు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ జె చిరంజీవి,ప్రజాసంఘాల నాయకులు నుకతోటి బాబురావు,ఏసోబు,గుమ్మడి ఏసురత్నం, వెంకట్, పాపారావు, సీపీఎం నాయకులు నలతోటి బాబురావు,ఎమ్ వసంతరావు, భగవాన్,డేవిడ్, పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖోఖో బాలబాలికల జట్ల ఎంపిక

విశాలాంధ్ర-కనిగిరి : ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జూనియర్ బాల,బాలికల జట్ల ఎంపిక శుక్రవారం జరుగుతుందని ప్రకాశం జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే భాస్కరరావు, భవనం కాశీ విశ్వనాథ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర జట్టు జే పంగులూరులోని ఎమ్మెస్సార్ అండ్ బిఎస్ఎం జూనియర్ కళాశాలలో జరుగుతుందని, బాలికల జట్టు కనిగిరి మండలం కంచర్ల వారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. ఎంపికైన బాల బాలికల జట్లు అక్టోబర్ 20 నుంచి 22 వరకు చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 9848219080 చరవాణి నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

జగన్ అంతం...గిరిజనుల పంతం

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు అక్రమ అరెస్టుకి నిరసనగా పార్టీ ఇంచార్జీ వేగేశన ఆదేశాల మేరకు బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం అని ఎస్‌టి సెల్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయంలో అనేక పథకాలు ఏర్పాటు చేసి గిరిజనుల విద్యార్థుల కోసం రూ. 12 కోట్ల వ్యయంతో గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి చంద్రబాబు కృషి చేశారన్నారు. ఒక్కకొక్క స్కూల్‌కి 12కోట్లు కేటాయిస్తే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమాన్ని గాలికి వదిలేసి బాక్సైట్ త్రవ్వకాలను కొనసాగిస్తూ లక్షలాది ఎకరాల గిరిజన భూములను సెజ్ల పేరుతో అన్యక్రాంతం చేశారన్నారు. వేగేశన నరేంద్ర వర్మని గెలిపించు కోవడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. చంద్రబాబుని తక్షణమే నిర్దోషిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చుక్కా పాల్ రాజ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు నంబూరి ఏడుకొండలు, స్టువార్టుపురం గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి బల్లాని నాగరాజు, కర్లపాలెం మండల ఎస్టీ సెల్ నాయకురాలు కట్టా సుజాత, నాయకులు వీరయ్య, నంబూరి నాంచారయ్య, గున్నం అంకమ్మరావు, గోసు రాంబాబు, చౌటురి ఏడుకొండలు, మోటా జాన్, ఉయ్యాల శివ, గోలి వెంకటేష్, దేవరకొండ శ్రీను, కోనేటి రాఘవులు , కొమరగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్య...వెళ్లి రావయ్యా

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ రూపాల్లో, అందంగా ముస్తాబు చేసి మండపాల్లో ప్రతిష్టించిన బొజ్జ గణపయ్యలకు ప్రజలు వీడ్కోలు చెబుతూ వెళ్లి మరల వచ్చే సంవత్సరం రావయ్యా అని కదలి ఒడికి సాగనంపారు. గత పది రోజులుగా పూజల ందుకున్న గణనాథులు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఊరేగింపులో ప్రజల ఆనందోత్సాహాల మధ్య గంగమ్మ తల్లి దగ్గరకు చేరారు. బాణాసంచా కాల్పులతో, కోలాట, డప్పు వాయిద్యాల నృత్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. సన్నాయి, బ్యాండు మేళం, తీన్మార్ వాయిద్యాల మధ్య భక్తులకు అభయ ప్రదానం చేస్తూ వినాయకులు కదిలారు. మండలంలోని దేవాంగపురి, ఈపురుపాలెం, తదితర గ్రామాలు, చీరాల పట్టణంలో ఉన్న గణనాయకులు సముద్రుడిలో నిమజ్జనం కావడానికి తరలి వెళ్లారు. పలు మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు. లడ్డు వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. సముద్ర తీరం వెంబడి మెరైన్ పోలీసు సిబ్బంది అటూ ఇటూ తిరుగుతూ హెచ్చరికలు జారీచేస్తూ బందోబస్తు నిర్వహించారు.

దీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైకాపా ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి రిమాండుకు తరలించడాన్ని నిరసిస్తూ చీరాలలలో నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎం ఎం కొండయ్య ఆధ్వర్య ంలో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన మత్స్యకారులు రిలే నిరాహారదీక్షలలో పాల్గొన్నారు. తెదేపా పరిశీలకులు నాతాని ఉమా మహేశ్వరరావు, సలగల రాజశేఖర్, షేక్ యాసిన్, నాగేశ్వరరావు, గజవల్లి శ్రీనివాసరావు,కౌతరపు జనార్ధన్ రావు, తెదేపా నాయకులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి రానున్న ఎన్నికలలో ప్రజలంతా భారతీయ జనతా పార్టీకి అండగా నిలిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రావి పాటి కాశిదేవి అన్నారు. గురువారం మండల ప్రవాస యువజన కార్యక్రమంలో భాగంగా వైదన గ్రామంలో శక్తి కేంద్ర మండల విస్తారక్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో జరగా వారికి పార్టీ కండవాలు కప్పి సాధారణంగా పార్టీలో ఆహ్వానించారు. ఈ సమావేశంలో రామకృష్ణ, శ్రీనివాసరావు, రామారావు, మణికంఠ పాల్గొన్నారు.

900 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేశామని నగరం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెబ్ బాపట్ల అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు నిజాంపట్నం మండలంలోని అదవల గ్రామ శివారులోని మడ అడవుల్లో, సముద్ర తీర ప్రాంతంలో దాడులు నిర్వహించామని చెప్పారు. ఆ ప్రాంతాల్లో నాటు సారా తయారీకి ఉపయోగించేందుకు నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశామన్నారు. నగరం సెబ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారు చేసిన, అమ్మకాలు జరిపిన వారి పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడిలో నగరం సబ్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కావాలని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - బాపట్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకి నిరసనగా నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు బాబు గారికి తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం అంటూ చెంగళరాయుడు తోటలోని లూథరన్ చర్చిలో ఏఈఎల్‌సి డెలిగేట్ ఐనంపూడి షాలేం రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ప్రధానకార్యదర్శి తానికొండ దయబాబు, అదే వంశీ, కూచిపూడి ఝాన్సీ, కూచిపూడి జాషువ, పాదర్తి దాసు,కట్ట హైమరావు, ఐనంపూడి అశోక్, బడుగు కిరణ్, బడుగు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో చైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని కూకట్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యిప్పల నాసర రెడ్డి దశ దిన కర్మకు గురువారం శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరై నాసర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షులు బల్లికురవ మండలం పార్టీ అధ్యక్షులు చింతల పేరయ్య, కూకట్లపల్లి గ్రామ సర్పంచి ఇప్పల అయ్యప్ప రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.